www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 23 నవంబర్ 2024

5

తూర్పుగోదావరి



108 ఉద్యోగుల సమస్యలు రాష్ట్ర పరిధిలోవి..

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

108 ఉద్యోగుల సమస్యలు రాష్ట్ర పరిధిలో ఉన్నాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 'ఆపద్బాంధవికే ఆపద' శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సిబ్బంది వేతనాలు, ఉద్యోగ భద్రత, వాహనాల మరమ్మతులు, నిర్వహణ తదితర అంశాలను 108 సిబ్బంది డిమాండ్‌గా ఉందన్నారు. తమ పరిధిలోని పరిష్కరిస్తామని తెలిపారు. 108 ఉద్యోగులు సమస్యలను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అగస్టు, సెప్టెంబరు నెలల జీతాలు ఇప్పటికే వారికి చెల్లించామన్నారు.

అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు

- స్థానిక నేతల బరితెగింపు
- అధికర ధరలకు విక్రయం
- అక్రమాలకు అడ్డాగా వేమగిరి-బుర్రిలంక ర్యాంపు

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం వేమగిరి-బుర్రిలంక ఇసుక ర్యాంపు అక్రమాలకు అడ్డాగా నిలిచింది. ఇక్కడ బినామీల ముసుగులో కొందరు స్థానిక నేతలు దందా కొనసాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

వేమగిరికి చెందిన జాతీయ స్థాయి గుత్తేదారునికి సంబంధించిన సంస్థ ఆర్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు ఈ ర్యాంపులో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ఇక్కడ మెట్రిక్ టన్ను ఇసుకను రూ.61.37 పైసలు అందించాల్సి ఉంది. 6 నెలలు కాలానికి ఇక్కడ ఇసుక త్రవ్వకాలు జరుపుకునేందుకు అనుమతులు ఉన్నాయి. ఆరు నెలల కాలంలో 90 వేల మెట్రిక్ టన్నుల నుంచి లక్ష మెట్రిక్ టన్నులు ఇసుకను మాత్రమే ఇక్కడ తవ్వాల్సి ఉంది. అయితే ఇక్కడ ఈ సంస్థ తరపున బాబి అనే వ్యక్తి పేర తవ్వకాలు కొనసాగిస్తున్నారు. పేరుకు ఆయనే అయినా స్థానిక నాయకుల దందా ఇక్కడ ఎక్కువైంది. రాత్రి పగలు తేడా లేకుండా వందలాది లారీల ఇసుక ఇక్కడ నుంచి తరలి పోతుంది. కనిష్ఠంగా 20 టన్నుల నుంచి గరిష్ఠంగా 40 టన్నుల సామర్థ్యం ఉన్న లారీలో ఇసుకను అడ్డగోలుగా తరలించేస్తున్నారు. అసలు ఇక్కడ ఇసుక అనుమతులు పొందిన సంస్థ నిర్వహిస్తుందా? లేదా సబ్ కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నాడా? అనేది ఎవరికీ తెలియని పరిస్థితి.

ఆన్ లైన్ ద్వారా బుక్ చేసుకున్న వినియోగదారుల నుంచి 10 టన్నులు కూపన్లు తీసుకుని లారీ సామర్థ్యంను బట్టి 25 టన్నులు నుండి 30 టన్నులు ఇసుకను అధిక ధరలకు అమ్మకాలు కొనసాగిస్తున్నారు. వినియోగ దారుడు నిలదీస్తే లోడింగ్ చార్జీలు అంటూ టన్నుకు రూ.200 వసూలు చేస్తున్నారు. ఆఫ్ లైన్‌లో 20 నుంచి 25 టన్నులు ఇసుకకు బిల్లులు తీసుకుంటూ వారి నుంచి టన్నుకు రూ.250 నుంచి రూ.400 వరకూ అక్రమంగా వసూలు చేస్తున్నారు. బిల్లులు మాత్రం 10 టన్నులకు మాత్రమే ఇస్తున్నారు. వినియోగదారుడు బిల్లు అవసరం లేదంటే టన్ను రూ.250 తీసుకుని ఇసుకను తరలించేస్తున్నారు. రోజుకు వందలాది లారీల ఇసుక ఇలా తరలిపోతుంది. నిబంధనల మేరకు ఈ పాటికే 90వేల మెట్రిక్ టన్నుల ఇసుకను ఇప్పటికే తరలించేసినట్టు సమాచారం.

కడియం మండలానికి చెందిన రెవెన్యూ అధికారులు గాని, సిబ్బంది గాని ర్యాంపును పర్యవేక్షించిన దాఖలు లేవని లబ్ధిదారులే చెబుతున్నారు. సంబంధిత అధికారులు ర్యాంపు వైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఈ ర్యాంపు నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఇసుకను అబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు చేయాలని వినియోగదారులు, ప్రజలు కోరుతున్నారు.



ర్యాంపులో ఇసుక ట్రాక్టర్లు



ర్యాంపు వద్ద బారులుతీరిన లారీలు



నిర్వహణ సంస్థ ఏర్పాటు చేసిన బేనర్

టన్నుకు రూ.350 చెల్లించా...

తాను వేమగిరి ఇసుక ర్యాంపు నుంచి ఆఫ్ లైన్ ద్వారా 20 టన్నులు ఇసుకకు టన్నుకు రూ.350 చొప్పున రూ.7 వేలు చెల్లించి కొనుగోలు చేశానన్నారు. 10 టన్నులకు మాత్రమే రేటు నమోదు చేయకుండా బిల్లులు ఇచ్చారని తెలిపారు. ఇది వినియోగదారునికి ఉచిత ఇసుక ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈ దోపిడీని ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు అరికట్టాలని కోరారు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ స్టాలిన్ దష్టికి తీసుకువెళ్లానని తెలిపారు.

- బల్ల అన్నవరం, ఫిషర్ మెన్ సొసైటీ మాజీ అధ్యక్షులు, జేగురుపాడు

విచారణ చేపట్టాలి

విచారణ చేపట్టాలి

ఇసుక అధిక ధరలు, అక్రమ త్రవ్వకాలపై విచారణ చేపట్టి ర్యాంపు నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే అక్రమాలు రుజువైతే వేమగిరి ర్యాంపు అనుమతులు రద్దు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ అధికారులు ఉచిత ఇసుకను వినియోగదారులకు యధావిధిగా అందజేయాలన్నారు. ఈ విషయం లో కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, నేతలు తమ చిత్త శుద్ధిని నిరూపించు కోవాలన్నారు.

- స్టాలిన్, సర్పంచ్, జేగురుపాడు

సమగ్ర అభివృద్ధే ధ్యేయం

రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా చిత్తశుద్ధితో పనిచేస్తానని రుడా చైర్మన్, టిడిపి రాజానగరం నియోజక వర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి తెలిపారు. ప్రియాంక గార్డెన్స్‌ల శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తన సేవలను గుర్తించి రుడా చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అలాగే సహకరించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రుడా పరిధిలోని ప్రజా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలపారు. 1970నుంచి రాజకీయాల్లో ఉన్న తన తండ్రి బొడ్డు భాస్కరరామారావు సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షునిగా, సమితి ప్రెసిడెంట్‌గా, జడ్‌పి చైర్మన్‌గా, ఎంఎల్ఎగాగా, రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షునిగా, ఎంఎల్‌సిగా పనిచేశారన్నారు. తన తండ్రి ఇచ్చిన ఆస్తి ప్రజాభిమానమేనని తెలిపారు. దాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. రుడా పరిధిలో ఉన్న ప్రాంతాల అభివృద్ధితో పాటు టిడిపి రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కార్యకర్తల బాగోగులను కూడా చూసుకుంటానని తెలిపారు. ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం రుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపడతానని, అదేరోజు చెరుకూరి కన్వేషన్‌లో ప్రజాప్రతినిధులు, కూటమినేతలు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రుడా తరపున గతంలో చేపట్టిన పనులు, లోటు పాట్లు, వంటి విషయాలను మీడియా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.



వాలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ రాంబాబు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎన్నికల ముందు చంద్రబాబు వాలంటీర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు టి.రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తాను అధికారంలోకి వస్తే వాలంటీర్లకు నెలకు రూ.10వేలు వేతనం ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీని నిలబెట్టుకోవాలన్నారు. శాసన మండలి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ 'వాలంటీర్లు లేరు' అని చెప్పడం సరైంది కాదన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత వాలంటీర్లను తొలగిస్తున్నట్లు జిఒ కూడా విడుదల చేయలేదన్నారు. అలాంటప్పుడు వాలంటీర్ల వ్యవస్థ లేదని మంత్రి ప్రకటించడం బాధ్యతారహిత్యమన్నారు. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి ఇప్పుడు ముఖ్యమంత్రి సైలెంట్‌గా ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైసిపి నాయకుల ఒత్తిడితో కొంతమంది రాజీనామా చేస్తే, రాష్ట్రంలో లక్ష మంది రాజీనామా చేయకుండా ఉన్నారని గుర్తు చేశారు. వెంటనే అందర్నీ విధుల్లోకి తీసుకొని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వాలంటీర్లతో కలిసి కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

వర్క్‌షాపు విజయవంతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాల భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న మాట్ ల్యాబ్ కార్యశాల విజయవంతమైందని ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ డి. సంజీవ్ కుమార్ ఫిజిక్స్ లోని అనేక అంశాలకు మాట్ ల్యాబ్ సిములేషన్స్ ఎలా అన్వయించవచ్చు అనేదానిపై ప్రయోగాత్మకంగా వివరించారు. ముగింపు సభలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి సిహెచ్. కోమలలక్ష్మి ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారందరికి సర్టిఫికెట్స్‌ను అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు 'బాధ్యత' చేయూత

ప్రజాశక్తి - కడియం

అగ్నిప్రమాద బాధితులకు బాధ్యత సేవా సంస్థ చేయూతను అందించింది. పిడింగొయ్యి సాయిబాబా పుంత రోడ్డులో ఉన్న విజయ సిరామిక్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చూచి కొండ సత్యవతి, శిడగం పద్మ కుటుంబాలకు చెందిన తాటాకు ఇళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కాలి బూడిదైంది. సర్వం కోల్పోయి వారు నిరాశలయ్యారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కడియం బాధ్యతా సేవా సంస్థ అధ్యక్షులు గిరజాలబాబు స్థానిక నాయకులు మాజీ వార్డు సభ్యులు మేడి త్రిమూర్తులు, ఎంపిటిసి మాజీ సభ్యులు పిల్లా లక్ష్మణ్, చిలకల రామారావులతో కలిసి బాధితులను పరామర్శించారు. రెండు బాధిత కుటుంబాలకు బాధ్యత సేవ సంస్థ ద్వారా నిత్యావసర వస్తువులు, దుస్తులు, వంట సామగ్రి, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలుగొండ రవి, పున్నమిరాజు వీర్రాజు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వేతనాల కోసం మిడ్డే మీల్స్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - దేవరపల్లి

వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని ఎంఇఒ కార్యాలయం వద్ద మిడ్డే మీల్స్ వర్కర్లు, స్కూల్స్ స్వీపర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు సేవలందిస్తున్న స్కూల్స్ స్వీపర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతన బకాయిల ఇవ్వక పోవడంతో ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారన్నారు. స్కూల్ స్వీపర్లకు ఐదు నెలలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు మూడు నెలలు వేతన బకాయిలు ఉన్నాయన్నారు. ప్రతి నెలా సక్రమంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచాలన్నారు. యూనిఫామ్ ఇవ్వాలని, సెలవులు మంజూరు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుందన్న హామీని అమలు చేయాలని కోరారు. విద్యార్థుల సంఖ్యకు నిబంధన పేరుతో స్కూల్స్ స్వీపర్లపై పని ఒత్తిడి పెరిగిందన్నారు. ఈ నిబంధనను తొలగించాలన్నారు. అనంతరం ఎంఇఒ తిరుమల దాసుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్స్ స్వీపర్స్ యూనియన్ నాయకులు వై.పుష్పకుమారి, గుడిమెట్ల విమల, సాధనాల గంగ, లింగంగుంట వెంకటలక్ష్మి, షేక్ కరీబి, యాళ్ల బుజ్జమ్మ, మధ్యాహ్న భోజన పథకం నాయకురాలు దుగ్గిన మాణిక్యం, ఎం.రాజకుమారి, షేక్ రంజాని, షేక్ మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు, స్వీపర్లు

పిఆర్‌సి బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం దేవరపల్లి విశ్రాంత ఉద్యోగులు భవనంలో పల్లా సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పిఎస్ఎస్ఎన్‌పి.శాస్త్రి మాట్లాడారు. పిఆర్‌సి జాప్యం కారణంగా వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. 2018 జూలై నుంచి విశ్రాంతి ఉద్యోగులకు ఇవ్వాల్సిన డిఆర్ పిఆర్‌సి బకాయిలు వెంటనే నగదుగా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు జి.జేమ్స్, పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యనారాయణరాజు, తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాష్‌రావు సహాధ్యక్షుడు పిఎస్.ప్రసాద్ కోశాధికారి డి.సాయిబాబా, ఉపాధ్యక్షులు పివి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి

అవకాశాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రస్తుత సమాజంలో మహిళలు అభివద్ధి చెందడానికి ప్రభుత్వంతో పాటు స్వర్ణాంధ్ర లాంటి స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సహకారం, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత టెలికం డిప్యూటీ జనరల్ మేనేజర్ పివి.చలపతిరావు అన్నారు. శుక్రవారం స్వర్ణాంధ్ర స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన 75వ బ్యాచ్ ఉచిత కుట్టి శిక్షణ ముగింపు వేడుకలో చలపతిరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ మహిళలకు అందిస్తున్న చేయూత అభినందనీయమన్నారు. నిర్వాహకులు రాంబాబు సేవలను కొనియాడారు. మరో ముఖ్య అతిథి విశ్రాంత రైల్వే అధికారి చర్ల రాజరాజేశ్వరి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం ఇలాంటి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు అవసరం ఎంతో ఉందన్నారు. స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ 27 ఏళ్లుగా 18 వేల మంది మహిళలకు టైలరింగ్ అండ్ డ్రెస్ మేకింగ్, మగ్గం, కంప్యూటర్ బ్యూటీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ అందించామన్నారు. శిక్షణలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో టీచర్ దివ్య, సిబ్బంది మీరా కుమారి, ప్రసాద్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాపికలు అందిస్తున్న చలపతిరావు, రాంబాబు

అదానీని తక్షణమే అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - నిడదవోలు

భారీ కుంభకోణానికి పాల్పడిన అదానీని తక్షణమే అరెస్టు చెయాలని సిపిఎం జిల్లా నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. గౌతమ్ అదానీ గ్రూపునకు చెందిన మరో ఆరుగురిపై అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైన నేపథ్యంలో గౌతమ్ అదానీని అరెస్టు చెయ్యాలని నిడదవోలులో డాక్టర్ బిఆర్.అంబద్కేర్ చౌక్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లేశ్వరంలో కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని మల్లేశ్వరం గ్రామం రంగనీడి వారి వీధిలో ముసలమ్మ అమ్మవారి దేవాలయం వద్ద శుక్రవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. కడింపాడు, అన్నవరప్పాడు, దొంగరావిపాలెం, పిట్టల వేమవరం తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

భద్రతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కోరుకొండ సిఐ సత్యకిషోర్ ఆధ్వర్యంలో భద్రపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత, పిల్లలు భద్రత, రోడ్ సేఫ్టీ, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఏ విధమైన సమస్య తలెత్తినా వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు ఈ కార్యక్రమంలో సీతానగరం సబ్ ఇన్‌స్పెక్టర్ డి.రామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రికి ఆపరేషన్ టేబుల్ వితరణ

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి ఆపరేషన్లు నిర్వహించేందుకు టేబుల్ం తెలుగు మహిళ జగ్గంపేట నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు అల్లాడ అరుణ వితరణ చేశారు. ఈ టేబుల్‌ను శుక్రవారం డాక్టర్ ఝాన్సీ రాణికి అందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నబాబు భూపతిపాలెం స్కూల్ చైర్మన్ గళ్ల రాము, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, పిట్టా అరుణ్, తెలుగు యువత నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ మండిగ గంగాధర్, అల్లాడ తేజ, జీవా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఆపరేషన్ బెంచీని అందిస్తున్న అరుణ తదితరులు



రేషన్ బియ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎజిపిఒ రంగప్రసాద్

రేషన్ బియ్యంలో పోషక విలువలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రేషన్ బియ్యం బలవర్ధకమైన ఆహారమని, అందులో కెర్నల్స్ వంటి పోషకాలు ఉంటాయని రాజమహేంద్రవరం డివిజన్ అసిస్టెంట్ గ్రెన్ పర్చేజింగ్ ఆఫీసర్(ఎజిపిఒ) రంగ ప్రసాద్ అన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు శుక్రవారం అన్నపూర్ణమ్మ పేటలో రేషన్ బియ్యం లబ్ధిదారులకు బియ్యం వినియోగం పట్ల కలిగే ప్రయోజనాలను మండల సప్లయీస్ అధికారి ఎం.నాగలక్ష్మితో కలసి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యం బలవర్ధకమైన ఆహారమన్నారు. వీటితో పిండి వంటలు కూడా వండుకుని తినడం వల్ల అందులోని పోషకాలు సమద్ధిగా అందుతాయన్నారు. కొంత మంది లబ్ధిదారులు రేషన్ బియ్యంపై లేనిపోని అపోహలతో వీటిని దళారులకు తక్కువ ధరకి విక్రయిస్తున్నారని తెలిపారు. అందువల్ల పోషకాల పరంగా లబ్ధిదారులైన ప్రజలు చాలా నష్టపోతున్నారన్నారు. అందువల్ల రేషన్ బియ్యం ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. లబ్ధిదారుల నుంచి ఎవరైనా రేషన్ బియ్యం కొనుగోలుకు ప్రయత్నిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

మంత్రి లోకేష్‌తో ఎంఎల్ఎ బత్తుల భేటీ

ప్రజాశక్తి - కోరుకొండ

రాజానగరం నియోజకవర్గంలో విద్య, ఉపాధి అంశాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర హెచ్ఆర్‌డి, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ కోరారు. శుక్రవారం అసెంబ్లీ లాబీలో మంత్రి లోకేష్‌ను ఎంఎల్ఎ బత్తుల మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని 16 అంశాలపై వినతి పత్రం అందించారు. నియోజకవర్గంలో విద్యార్థులు డిగ్రీ విద్యను అభ్యసించేందుకు వీలుగా రాజానగరం, కోరుకొండ మండలాల్లో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. గాడాల, పుణ్యక్షేత్రం, తుంగపాడు ప్రాంతాల్లో 10వ తరగతి పాఠశాలలను ఇంటర్మీడియట్ కాలేజీలుగా మార్చాలనానరు. శ్రీకృష్ణపట్నం, గాదరాడ గ్రామాల్లో నూతనంగా ఇంటర్మీడియట్ కాలేజీలు ఏర్పాటు చేయాలని, రాజానగరం నియోజకవర్గానికి ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. నన్నయ యూనివర్సిటీకి తగిన నిధులు కేటాయించడంతో పాటు, పాఠశాలల్లో నాడు-నేడు పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. మధురపూడి ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్, సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించాని బత్తుల తెలిపారు.



లోకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంఎల్ఎ బత్తుల

'టిడిపికి మరింత బలాన్ని చేకూర్చండి'

ప్రజాశక్తి- కడియం

టిడిపి ఆవిర్భావం నుంచి కంచుకోటగా ఉన్న కడియం మండలంలో పార్టీకి మరింత బలాన్ని చేకూర్చాలని టిడిపి హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ అన్నారు. కడియపులంకలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి బోడపాటి గోపి ఆధ్వర్యంలో శుక్రవారం టిడిపి సభ్యత్వ నమోదు జరిగింది. ఈ సందర్భంగా గోరంట్ల కిరణ్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ సభ్యత్వ నమోదు రాష్ట్రంలో మొదటి స్థానంలోకి తీసుకువెళ్లాలని కోరారు. టిడిపి సభ్యత్వ నమోదు ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెలుగుబంటి నాని, ప్రత్తిపాటి రామారావు చౌదరి, బి.వెంకటేశ్వరరావు, సత్తి వెంకటగిరి, బండి నాగమణి, ఐటిడిపి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కుమార్తె అదృశ్యంపై ఆమె తల్లి చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాల ప్రకారం.మండలంలోని సిహెచ్.గున్నేపల్లి గ్రామానికి చెందిన కటిక రెడ్డి అమ్మాజీ భర్తతో విడిపోయి కొంత కాలంగా పుట్టింటిలోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో గురువారం ఇంటి పనుల విషయంలో తల్లి మందలించడంతో అమ్మాజీ ఇంటి నుంచి వెళ్లి పోయింది. ఆమె కోసం చుట్టుపక్కల ఇళ్లలో, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లి గాలిదేవర అనంతలక్ష్మి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటే తరచూ భార్యను వేధిస్తున్న భర్త మరియు అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన మోర్త దీవెనకుమారికి సంవత్సరం క్రితం ముక్కామల గ్రామానికి చెందిన మోర్త నరేంద్రతో వివాహం అయ్యింది. పెళ్లి సమయంలో రూ.మూడు లక్షలు కట్నం ఇచ్చారు. కొన్ని రోజులు వీరి కాపురం సజావుగా సాగింది. ఇటీవల కాలంలో భర్త నరేంద్ర అత్తమామలు అదనపు కట్నం తేవాలంటూ కుమారిని వేధించడంతో ఆమె పుట్టింటికి వచ్చింది. శుక్రవారం ఆమె స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఆమె ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.

పేకాడుతున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.20,100, పేకలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వృద్ధునిపై వ్యక్తి దాడి

ప్రజాశక్తి-కాజులూరు

మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం ఒక వృద్ధునిపై ఒక వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం స్థానిక పలావ్ సెంటర్లో పని చేస్తున్న మడికి అప్పారావుతో మద్యం సేవించి వచ్చిన పలివెల వెంకటేష్ ఘర్షణ పడ్డాడు. కూరగాయలు తరిగే చాకుతో అప్పారావుపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ అప్పారావును స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ మోహన్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దాడుల్లో పాల్గొన ఎక్సైజ్ సిబ్బంది

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాల, ఎం.చామవరం, శృంగవరం గ్రామాల్లో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి ఆధ్వర్యంలో శుక్రవారం సారాబట్టీలపై దాడులు నిర్వహించారు. ఎస్.పైడిపాలలో 5800 లీటర్ల నాటు సారా తయారీకి అవసరమైన బెల్లపు ఊటనుప ధ్వంసం చేశామని, ఎం.చామవరంలో 1200 లీటర్ల బెల్లపు ఊటను 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఒకి వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు. శృంగవరంలో 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా కట్టమూరులో 600 లీటర్లు, మర్లావలో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సారా తయారీ, అమ్మకాలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా 0884-2376227కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఢీకొన్న బస్సు, కారు ప్రయాణికులు సురక్షితం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట-కాకినాడ రోడ్డు ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆర్టిసి బస్సు, కారు ఢీకొన్న సంఘటనలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం కాకినాడ రోడ్డులో ఎదురెదురుగా వెళుతున్న బస్సు, కారు ఎదురుగా ఢీకొన్నాయి. బస్సులో ప్రయాణికులు, కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలూ కాలేదు. ఎస్ఐ అడపా గరగారావు సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు శ్రీ సత్యసాయి గురుకులం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు శ్రీ సత్యసాయి గురుకులం ఏడు తరగతి విద్యార్థి బిఎస్వి.చరణ్ ఎంపికయ్యారు. ఎనర్జీ కన్జర్వేషన్ ఆఫ్ ఇండియా, ఎన్టిపిసి సింహాద్రి ఆధ్వర్యంలో ఈ నెల 21న విశాఖలో రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలను నిర్వహించింది. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 110 విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న సత్యసాయి విద్యార్థి చరణ్ చిత్రానికి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. ఇందులో భాగంగా చరణ్కు రూ.30 వేల నగదు, ప్రశంసా పత్రానికి ఎన్టిపిసి సిజిఎం సమీర్ శర్మ చేతులు మీదుగా అందుకున్నాడు. డిసెంబర్లో జరిగే జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలకు అర్హత సాధించాడని గురుకులం ప్రిన్సిపల్ కె.గుర్రయ్య తెలిపారు. గ్రూప్-బి విభాగంలో పదో తరగతి విద్యార్థి డి.హర్షవర్ధన్ ప్రత్యేక బహుమతిగా రూ.7,500, ప్రశంసాపత్రం అందుకున్నాడని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం ఉపాధ్యాయుడు మోటూరి శ్రీనివాసరావు, విద్యార్థి చరణ్ను స్కూల్ కరస్పాండెంట్ ఎ.శ్యామ్సుందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



అభినందిస్తున్న ప్రిన్సిపల్ గురయ్య, కరస్పాండెంట్ శ్యాంప్రసాద్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని యుటిఎఫ్ నూతన మండల కార్యవర్గం తెలిపింది. యుటిఎఫ్ సీతానగరం మండల నూతన కార్యవర్గం శుక్రవారం ఏర్పాటైంది. కాటవరం సంజీవపురం పాఠశాలలో జరిగిన ఈ ఎన్నికలో యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా సబ్బితి రాజు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.పావ--రావు, గౌరవ అధ్యక్షులుగా ఎం.పోశయ్య, సహాధ్యక్షులుగా కె.నాగేశ్వరరావు, పి.సూరిబాబు ఎన్నికయ్యారు. విజయలక్ష్మి కోశాధికారిగా, కార్యదర్శులుగా ఎంవి.రఘు, పి.సత్తిబాబు, కెఎన్ఎం.కుమారి, వి.వెంకటేశ్వరరావు, ఎంఎ.రాజు, ఆర్.రాంజీప్రసాద్, వి.వీరబాబు, కెఆర్ఎ.రామకృష్ణ, ఎం.సాంబశివరావు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ ముగ్గురు, జిల్లా మహాసభ ప్రతినిధులుగా ఏడుగురు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్.రవిబాబు, కె.నాగభూషణం, శ్రీమణి, రిటైర్డ్ ఉపాధ్యాయులు దేవవాణి, త్రిమూర్తులు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ

వన భోజనాలతో సామాజిక బంధాల పెంపు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సమాజంలో పెరిగిపోతున్న మనుషుల మధ్య అంతరాలను తగ్గించేందుకు వనభోజనాలు దోహదం చేస్తాయని ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయబాబు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వనభోజనాలలో సభ్యులందరూ కుటుంబాలతో సహా హాజరై పలు క్రీడ పోటీల్లో పాల్గొన్నారు. ఉదయం నుండి ఆటపాటలతో ఆనంద ఉత్సాహాలతో గడిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, ప్రకృతి పరిరక్షణ సంఘం నాయకులు గోళ్ల నాగేశ్వరరావు, జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్, కరోతు సత్యనారాయణ, వేల్పుల సూరిబాబు, రౌతు సహదేవుడు, చందువోలు రాజా, నారాయణరావు, సిరిపురపు రాజేష్, పెచ్చేటి కృష్ణ, తాళ్లూరి గొల్లాజిరావు, కోట శ్రీనివాస చక్రవర్తి ఉన్నారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్ల అంటింపు

సీతానగరం : కోరుకొండ సిఐ సత్య కిషోర్, సీతానగరం ఎస్ఐ రామ్కుమార్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలు నివారణకు వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించారు. భద్రత చర్యల్లో భాగంగా శీతాకాలంలో రోడ్డు ప్రమాదాలు నివారణ దృష్ట్యా సీతానగరంలో వాహనాలకు వెనకవైపు రేడియం స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రేడియం స్టిక్కర్ ప్రతి ఒక్క వాహనం వెనక భాగంలో ఉండాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి సహకరించాలన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ట్రూ అప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని సిపిఎం సీనియర్ నాయకులు ఉండవల్లి కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ట్రూ అప్ ఛార్జీలను ప్రభుత్వ భరించాలని, స్మార్ట్ మీటర్ల ఆలోచనను ఉపసహరించుకోవాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడారు. ఎన్నికల్లో ఎటువంటి విద్యుత్ భారాలు ప్రజలపై వేయబోమని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు దానికి విరుద్ధంగా ట్రూ అప్ ఛార్జీల పేరిట ప్రజలపై భారాలు వేస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు పేరుతో అదానీ కంపెనీకి వేల కోట్ల రూపాయలు దోచిపెడుతున్నారన్నారు. దాదాపు రూ.20 వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు వేయడానికి ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమన్నార. అనంతరం విద్యుత్ శాఖ ఎఇకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కె.రత్నాజీ, పిన్నమనేని సత్యనారాయణ, మడిల్లి రామారావు, ఎస్.భగత్ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

రోడ్లు, డ్రెయినేజీలకు ఎంఎల్ఎ భూమి పూజ

ప్రజాశక్తి - యానాం

స్థానిక అయ్యన్న నగర గ్రామంలో సుమారు రూ.20 లక్షలతో రోడ్లు డ్రైన్ల పునర్నిర్మాణానికి స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం భూమి పూజ చేశారు. భారీ వర్షాలకు వరదలకు రోడ్లు రైలు పూర్తిగా మునిగిపోవడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎంఎల్ఎ అశోక్ స్పందించి పనులను ప్రారంభించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎంఎల్ఎకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, స్లమ్ క్లియరెన్స్ బోర్డు జెఇ భాస్కరన్, ఎస్ఐ మురుగానందం, కాంట్రాక్టర్ గాలి వీరభద్రరావు గ్రామస్తులు లంకె లోవరాజు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ అశోక్

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం స్లమ్ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా గృహ నిర్మాణ లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక అతిథి గృహం వద్ద ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం ఐదు విడతలకు సంబంధించి సుమారు 74 మంది లబ్ధిదారులకు రూ.81 లక్షల 70 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పుదుచ్చేరి స్లమ్ క్లియరెన్స్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి-గండేపల్లి

మల్లేపల్లి గ్రామంలో ఆయిల్ పామ్ రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిజిఎం ఎఎస్.ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటలను వేసుకోవడం మూలంగా అధిక లాభాలను పొందవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ తోట పంట ప్రాముఖ్యత, ప్రత్యేకతల గురించి, కంపెనీ రైతులకు కల్పించే సదుపాయాలు గురించి, పంటను ఆశించే చీడ పీడలు వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హార్టికల్చర్ ఆఫీసర్ పి.లావణ్య మాట్లాడుతూ పామాయిల్ తోటల్లో వచ్చే తెల్ల దోమ నివారణ, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ సబ్సిడీ, పామాయిలు తోటల్లో అంతర పంటల ఆవశ్యకత, ఉద్యానశాఖ యొక్క రాయితీలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎస్.వీర్రాజు, జివివిఎస్.దుర్గాప్రసాద్, హార్టికల్చర్ విహెచ్ఎ.కనకయ్య, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

10న సిపిఎస్ ఉద్యోగుల 'చలో విజయవాడ'

ప్రజాశక్తి-కాకినాడ

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవమైన డిసెంబరు 10న చేపట్టిన సిపిఎస్ ఉద్యోగుల చలో విజయవాడ సభను విజయవంతం చేయాలని ఎపి సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్కెవి.బాషా, డి.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జిఒ హోమ్లో ఎపి జెఎసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గుద్దటి రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో పోస్టర్ను ఆవిష్కరించారు. గత ప్రభుత్వ హయాంలో వారంలో సిపిఎస్. రద్దు హామీ నిలబెట్టుకోలేదని, దీంతో పాటు పిఆర్సిలో అన్యాయం, డిఎ విడుదలలో జాప్యం, సరెండర్ లీవ్ల ఎన్ క్యాష్ మెంట్ కూడా జరగలేదని రామ్మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంఁల పసుపులేటి శ్రీనివాస్, ప్రదీప్, డాక్టర్. ఎం.రవికుమార్, పి.వెంకట కృష్ణ, మూర్తి బాబు, ఎం.వెంకటేశ్వరరావు, సత్తి రాజు, చింతా నారాయణ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి అలీం, జిల్లా అసోసియట్ అధ్యక్షుడు నూకరాజు, వాకాడ వెంకట రమణ, శ్రీరాములు, నరేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి శిక్షణ విజయవంతం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో రెండు రోజులపాటు ఏజన్సీ ప్రాంతాల పరిపాలనకి సంబంధించిన పీసా (షెడ్యూల్ ప్రాంతాలలో పంచాయితీల విస్తరణ) చట్టం గురించి ఇవ్వవలసిన శిక్షణకు సంబంధించి రాష్ట్ర స్థాయి రైట్ షాప్ విజయవంతంగా ముగిసిందని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి రైట్ షాప్ నిర్వహణలో ఎపిఎస్ఐ ఆర్డిపిఆర్ విజయవాడ ఆధ్వర్యంలో జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతాల ప్రజలు తమ హక్కులను కాపాడుకునే విధంగా వారి కోసం చేసిన పీసా చట్టంపై వారందరికీ అవగాహన కలిగించేందుకు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ రైట్ షాప్ ద్వారా వారందరికీ ఉపయోగపడే మెటీరియల్ తయారుకు అందరం పనిచేయాలని కోరారు.

డెంగీ, మలేరియాపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన గొల్లప్రోలు శివాలయం పంచాయతీ నగర్ ప్రాంతాలలో డెంగీ మలేరియా వ్యాధులపై ప్రజలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసుపత్రి పర్యవేక్షులు జి.శ్రీనివాసరావు, అహ్మద్ బాషా మాట్టాడారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో జనసముదాయాల్లో ఇంటింటా డెంగీ మలేరియా వ్యాధులు దోమకాటుతో వచ్చే వెక్టర్ డిసీజెస్ కంట్రోల్ దిశగా నీటి నిలువలు వారంతపు రోజులలో మార్చాలని, మూతలు వేసి ఉంచాలని, ఏడిస్ లార్వాను ఎలిమినేట్ చేయాలని, టైర్స్, జాడీలు, కూలర్స్లో డెంగీ ఏడిస్ మలేరియా అనాఫిలస్ దోమలు గుడ్లు పెడతాయని, వాటి ద్వారా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. రోగాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. జ్వరం వస్తే ల్యాబ్ పరీక్షలు చికిత్స అవసరం మేరకు మందులు వాడి నివారణ చేపట్టాలని సిబందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎఎన్ఎం లక్ష్మణ కుమారి, ఆశాలు, ప్రజలు పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ వద్ద ఆందోళన

ప్రజాశక్తి -కరప

కేంద్రంలో బిజెపి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న కాకినాడ కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనను జయప్రదం చేయాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు పిలుపు ఇచ్చారు. కరప మండలం వేళంగిలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గణేశుని శ్రీనివాస్ ఆందోళన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గరగ ప్రసాద్, నొక్కు చంటి, కొల్ల దుర్గ, పబ్బినేటి మామాజీ, కబ్బు విజయ్ కుమార్, తాతపూడి రాజు, పల్లా శ్రీనివాస్ తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

కాజులూరు : బాలిక, మహిళా చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పల్లిపాలెం గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు వరదా రామలక్ష్మి భవాని, భారతీ దేవి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఇన్ఛార్జి హెచ్ఎం శ్రీధర్ అధ్యక్షతన బాలిక, మహిళల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మహిళా సంరక్షణ కార్యదర్శులు మాట్లాడుతూ విద్యార్థులు బాలిక మహిళల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ఈవ్ టీజింగ్ గురించి ఎల్ఇడి స్క్రీన్పై వివరించారు. విద్యార్థులకు ఏ ఇబ్బందులు కలిగినా ఉపాధ్యాయులు, లేదా తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యార్థులను కోరారు.

తల్లిదండ్రుల జ్ఞాపికగా స్నానఘట్టం నిర్మాణం

ప్రజాశక్తి-కరప

తల్లిదండ్రుల జ్ఞాపకంగా స్నానాల ఘట్టం నిర్మించడం అభినందనీయమని యండమూరు గ్రామ సర్పంచ్ మారెళ్ల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కరప మండలం యండమూరులో గుర్రాల రాముడు, గుర్రాల గంగారత్నం దంపతుల జ్ఞాపకార్థం నిర్మించిన స్నానాల ఘట్టాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మారెళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ వీరి కుమారుడు గుర్రాల రాజుబాబు రూ.1.20 లక్షల ఆర్థిక సాయంతో ఈ స్నాన ఘట్టం నిర్మించారన్నారు. ఇన్నాళ్లు అంత్యక్రియలు అయిన తర్వాత చెరువులో స్నానం చేసేవారిమని, చెరువులు అపరిశుభ్రంగా ఉండడంతో స్నానాలు చేయకుండా వెళ్లిపోవడం జరిగేదని తెలిపారు. ఈ సమస్యను గుర్తించి స్థానాల ఘట్టాన్ని నిర్మించిన కుటుంబికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాన్ సూర్య ప్రకాష్, అంబేద్కర్ యువజన సంఘ కార్యదర్శి ప్రత్తిపాటి బుల్లిరాజు, వడ్డపాటి గోపి, బొమ్మతి కృష్ణ, నందికోళ్ల శ్రీను పాల్గొన్నారు.



సిబ్బందికి అవార్డులు అందిస్తున్న జిల్లా ఎస్పి

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సామర్లకోట

జిల్లాలోని ప్రజలు నేరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ సూచించారు. వేట్లపాలెం గ్రామంలో జరిగిన చోరీ కేసును చేదించిన పోలీస్ సిబ్బందికి పెద్దాపురం డిఎస్పీ డి.శ్రీహరి రాజు సమక్షంలో అవార్డులు అందజేసే కార్యక్రమం శుక్రవారం ఎస్పి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలంతా నేరాలు, చోరీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి వ్యాపారులు, గృహ యజమానులు వారి వ్యాపార సంస్థల్లో, ఇళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చోరీ కేసును త్వరిత గతిన చేదించిన క్రైమ్ బ్రాంచ్ ఎఎస్ఐ గంగిరెడ్డి బలరామ్, హెచ్సిలు శ్రీహరి, రాధాకృష్ణ, పిసిలు నాగేంద్ర, చౌదరి, అంజి తదితరులు సుమారు 15 మంది సిబ్బందికి ఎస్పి ఉత్తమ సేవా పురస్కారాలను అందజేశారు.

వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ పరిధిలోని 9, 11, 22, 24 వార్డులలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి ఆదేశాల మేరకు సానిటరీ ఇన్స్పెక్టర్ బి.ఆదినారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా పారిశుధ్య పనులు నిర్వహించారు. ఐదుగురు మేస్త్రిలు, ఆరుగురు సానిటరీ సెక్రటరీల ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది ఈ నాలుగు వార్డులలో పరిశుభ్రతా పనులు, డ్రైన్లలో పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ మేస్త్రీలు బి.సూరిబాబు, జె.రాజబాబు, బి.ప్రభాకర్, టి.అర్జీబాబు, సానిటరీ సెక్రటరీలు జయరామ్, దుర్గాప్రసాద్, వరప్రసాద్, వెంకటరమణ, దాదాజీ, ప్రత్యూష, భవాని, హైమ, సత్తిబాబు పాల్గొన్నారు.

పిబి.దేవంలో అత్యధికంగా 98 అర్జీలు

సామర్లకోట : మండలంలోని పెదబ్రహ్మదేవురంలో రీ సర్వే సమస్యలపై నిర్వహించిన గ్రామసభలో అత్యధికంగా 98 దరఖాస్తులు వచ్చినట్టు తహశీల్దారు కె.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పిబి.దేవంలో తహశీల్దారు చంద్రశేఖర్ రెడ్డి గ్రామ సభ నిర్వహించారు. కొన్ని సమస్యలపై 98 మంది దరఖాస్తులు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఈ సర్వేలో ఏర్పడిన సమస్యలు పరిష్కారానికి తీసుకునే చర్యలను రైతులకు స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామసభలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు వై.శ్రీనివాస్, సర్వేయర్ సీతారామాచార్యులు పాల్గొన్నారు.



దొండపూడి సెంటర్ను పరిశీలించిన ఆర్డిఒ

ప్రజాశక్తి - గోపాలపురం

దొండడ పూడి సెంటర్లో హైవే కోసం వేసిన అలట్మెంట్ను ఆర్డిఒ రాణి సుస్మిత శుక్రవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో హైవేను కుదించాలని వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్డిఒ ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, చిరు వ్యాపారులు ఆమెతో మాట్లాడారు. 22 మీటర్ల వెడల్పుతో నూతనంగా నిర్మించే జాతీయ రహదారి వల్ల జీవనోపాధి కోల్పోతామన్నారు. దొండపూడి పరిధిలో ఆర్ అండ్ బి ప్రభుత్వ స్థలంలో నిర్మించిన 101 నిర్మాణాలు, ప్రైవేట్ సొంత భూమిలో 128 నిర్మాణాలు రోడ్డు అలైన్మెంట్లో ఉన్నాయన్నారు. దీనికి 18 మీటర్లకు కుదించాలని కోరారు. దీనిపై ఆర్డిఒ మాట్లాడుతూ నేషనల్ హైవే అధికారులు అలైన్మెంట్ మార్చేందుకు అంగీకరించట్లేదన్నారు. మరోమారు ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె.అజయ్బాబు, సర్వేయర్లు, గ్రామస్తులు, వ్యాపారులు పాల్గొన్నారు.

చాగల్లులో 104 వైద్య సేవలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు సచివాలయం-2 వద్ద శుక్రవారం చాగల్లు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మనోజ్కుమార్ ఆధ్వర్యంలో 104 వైద్య సేవలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలపై సరే చేస్తున్నామన్నారు. రోగులను గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుక్కరుపాటి కీర్తి, ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశా వర్కర్లు లక్ష్మీదుర్గ, వెంకటలక్ష్మి, సుధారాణి, అంగన్వాడీ టీచర్ సుబ్బలక్ష్మి, డిఇఒ సిహెచ్.మహేష్బాబు తదితరులు పాల్గొన్నారు.